# ధనయోగం

ఒక శెట్టిగారు ఒక జ్యోతిష్కుడితో మాట్లాడుతుండగా అక్కడికి ఒక పేద కుర్రవాడు వచ్చాడు. జ్యోతిష్కుడు శెట్టిగారికి ఆ కుర్రవాణ్ణి చూపించి, "వీడి తండ్రి కూలిచేసుకొని బతుకుతాడు. అయితేనేం? వీడికి త్వరలోనే గొప్ప ధనయోగం వున్నది. వీడి తండ్రి సుఖపడిపోతాడు" అన్నాడు.

జ్యోతిష్కుడిమీద మంచి గురివున్న శెట్టిగారు ఆ కుర్రవాడితండ్రిని వెతుక్కుంటూపోయి, "నీ కొడుకుభారం కొంతకాలం నాకు వదలిపెట్టు. నీకు రెండువందల రూపాయలిస్తాను" అన్నాడు.

కూలివాడికి ఏదో అనుమానంవేసి, "ఏ ఉద్దేశ్యంతో అడుగుతున్నారు?" అన్నాడు.

"దురుద్దేశమేమీలేదు. వాడంటే ముచ్చటపడ్డాను. వాడికి మా ఇంట్లో రాజోపచారంగా జరుగుతుంది. కావలిస్తే ఇంకో మూడువందలు తీసుకో" అన్నాడు శెట్టిగారు.

కూలివాడికి అయిదువందలు ముట్టాయి. వాడి కొడుకుకు శెట్టిగారి ఇంట రాజోపచారంగా జరుగుతున్నది. నెల గడిచినా వాడికి డబ్బేమీ రాలేదు.

శెట్టిగారు జ్యోతిష్కుడివద్దకువెళ్ళి జరిగినదంతా చెప్పి, "ఆ కుర్రవాడికి ఇంతదాకా ధనయోగం పట్టలేదే?" అన్నాడు.

"పట్టకపోవడ మేమిటి? నువ్విచ్చిన డబ్బుతో వాడి తండ్రి పది గేదెలనుకొని, నిక్షేపంగా వ్యాపారం చేసుకుంటున్నాడు" అన్నాడు జ్యోతిష్కుడు.

(మే–71)